

అమరవీరులను స్మరిద్దాం: ఎస్పీ



అమరవీరుల వారోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవాలను జయప్రదం చేయాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పోలీసుకార్యాలయంలోని తన చాంబర్‌లో శనివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా అక్టోబరు 21 నుంచి 31 వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 21న అమరవీరుల సంస్మరణదినం, స్మృతి పరేడ్, పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారన్నారు. 22నుంచి 30 వరకు పోలీసు అమరవీరుల గ్రామాలు, పట్టణాలను సందర్శించుట, అమరవీరుల ఫొటోలు పాఠశాలల్లో ఉంచేలా అవగాహన కల్పించుట, చర్చావేదికలు, రక్షణపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలిపే చిత్రాల ప్రదర్శన, పోలీసు ఆయుధాలు, సాధనాలు, పరికరాలను ప్రదర్శించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. 28న వైద్యశిబిరాలు, రక్తదానాల నిర్వహణ, వాయుద్యాల ప్రదర్శన, 29న పోలీసుల త్యాగాలపై సెమినార్లు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 30న పోలీసు అమరవీరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులను గుర్తించి సన్మానం చేస్తామని వెల్లడించారు. 31న సమైక్యతా దినాన్ని చాటుతూ అమరవీరుల వారోత్సవాలు ముగిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల వారోత్సవాల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఏఆర్ ఆర్‌ఐలు చంద్రశేఖర్, వలి, ఆర్‌ఎస్సైలు వెంకటేశ్వర్లు, ప్రదీప్‌సింగ్, వీరన్న, ఏఎస్సై శ్రీరాములు ఉన్నారు.

10న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

పుట్టపర్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నవంబరు 10 నుంచి 15వతేదీ వరకు నిర్వహిస్తారని కలెక్టర్ టీఎస్ చేతన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కడప జిల్లా కేంద్రాలలో నవంబరు 10వతేదీ నుంచి అగ్నివీర్ జనరల్ డ్యూటీ టెక్నికల్, ఆఫీసు అసిస్టెంట్, ట్రేడ్ మెన్ తదితర వాటికి రిక్రూట్ మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నిరుద్యోగ యువత ర్యాలీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కుర్చీ కోసం..

సందిగ్ధంలో చైర్మన్ పదవి

ఆశావహుల ఆరాటం

పురం మునిసిపల్ పీఠంపై ఉత్కంఠ



హిందూపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హిందూపురం మునిసిపల్ పీఠం కోసం ఆశావహులు ఆరాట పడుతుండగా, పట్టణ ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మునిసిపాలిటీలో 38వార్డులు ఉండగా 2021లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ 30 స్థానాలు, టీడీపీ ఆరు, ఎంఐఎం, బీజేపీ చెరో స్థానం గెలుచుకున్నాయి. 19వ వార్డు నుంచి వైసీపీ తరఫున గెలుపొందిన కౌన్సిలర్ ఇంద్రజకు చైర్‌పర్సన్ పదవిని అప్పగించారు. ఈమె మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ వర్గం కావడంతో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వచ్చిన దీపిక వర్గంతో అంటీముట్టనట్లు వ్యవహరించారు. దీంతో మునిసిపాలిటీలో చైర్‌పర్సన్ మాట జరగనీయకుండా దీపిక వర్గం అడ్డుకునేది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇక్బాల్‌తోపాటు ఎన్నికలకు ముందే టీడీపీలో చేరాలని ఆమె భావించారు. కానీ అలా జరగలేదు. ఎన్నికల అనంతరం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో ఆమె టీడీపీలో చేరారు. ఈమెతో పాటు మరో 8 మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. చైర్‌పర్సన్ పదవికి ఇంద్రజ రాజీనామా చేయడంతో నూతన చైర్మన్ ఎంపిక అనివార్యమైంది.

తొలగని ఉత్కంఠ

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వచ్చిన సభ్యులతో టీడీపీ బలం 18మందికి పెరిగింది. వీరికి ఎమ్మెల్యే, ఎంపీ ఓటు ఉండటంతో చైర్మన్ పదవికి కావాల్సినంత బలం టీడీపీకి ఉండేది. కానీ అనూహ్యంగా టీడీపీలో చేరిన నలుగురు కౌన్సిలర్లు పది రోజుల కిందట తిరిగి వైసీపీలో చేరారు. దీంతో ప్రస్తుతం టీడీపీ బలం 14కి పడిపోయింది. వైసీపీకి 24 మంది సభ్యుల బలం ఉందని చైర్మన్ పదవి కోసం కొంత మంది ఆశావహులు ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లారు. ఇందులో ముగ్గురు కౌన్సిలర్లు చైర్మన్ పదవి తమకే ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. స్థానికంగా మీరే నిర్ణయించుకోండని అధిష్ఠానం ఖర్చు పెట్టే పరిస్థితిలో లేదని ఆయన చెప్పడంతో వారంతా విజయవాడ నుంచి వెనుతిరిగి వచ్చారు. మరోసారి కర్ణాటకలో కూడా వైసీపీ క్యాంప్ రాజకీయానికి తెరలేపింది. మరో ఐదుగురు సభ్యులు కూడా వైసీపీలోకి చేరుతున్నట్లు పుకార్లు పుట్టించారు. కానీ ఆ తరువాత వైసీపీలోకి ఎవరూ వెళ్లలేదు. ఎంపీ, ఎమ్మెల్యే ఓటు కలుపుకుని టీడీపీకి 16మంది సభ్యుల బలం ఉంది. కాగా వైసీపీకి చెందిన మరో ఆరుగురు సైకిల్ ఎక్కడానికి సిద్ధమైనట్లు సమాచారం. వారు వస్తే టీడీపీ బలం 22కు చేరుతుంది. అప్పుడు వైసీపీ బలం 18తో ఆగిపోతుంది.

సాంకేతిక సమస్యలతో సతమతం

సాధారణంగా జిల్లా పరిషత్, మునిసిపల్, మండల పరిషత్ చైర్మన్, అధ్యక్ష స్థానాలు మార్చాలంటే నాలుగేళ్లపాటు ఆగాలి. ఎన్నికకాబడిన చైర్మన్, ఎంపీపీలను నాలుగేళ్లపాటు మార్చేందుకు వీలులేకుండా గతంలో జీఓ విడుదల చేశారు. ఇదే ఇప్పుడు ప్రధాన అడ్డంకిగా మారింది. అయితే హిందూపురంలో చైర్‌పర్సన్ స్వచ్ఛందంగా రాజీనామా చేయడంతో చైర్మన్ ఎన్నికకు నిబంధన వర్తించదని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్త చైర్మన్‌ను ఎన్నుకునేందుకు మునిసిపల్ కమిషనర్ ఎన్నికల సంఘానికి, మునిసిపల్ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. రాష్ట్రంలో హిందూపురంతోపాటు మరికొన్ని మునిసిపల్ చైర్మన్‌ల ఎన్నిక జరగాల్సి ఉంది. ఒకటి రెండు చోట్ల సాంకేతికపరమైన సమస్యలు అడ్డంకిగా మారడంతో హిందూపురంలో కూడా చైర్మన్ ఎన్నిక వాయిదా పడుతూ వస్తున్నట్లు తెలుస్తుంది.

ఆశావహుల ఎదురుచూపు

ఇవన్నీ ఇలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొంతమంది వైసీపీ సభ్యులు రావడం, తిరిగి వెళ్లడంతోపాటు మరికొంతమంది తెలుగుదేశం వైపు చూస్తుండటంతో అటు వైసీపీ ఇటు టీడీపీలో చైర్మన్ పదవి ఆశిస్తున్నవారికి ఎదురుచూపులు మిగిలాయి. ఆరో వార్డు కౌన్సిలర్ డీఈ రమేష్ పేరును చైర్మన్ పదవికి ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్ణయించినట్లు తెలుస్తుంది. వైసీపీలో చైర్మన్ కోసం ముగ్గురు, నలుగురు పోటీ పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో చైర్మన్‌పదవి కోసం రెండు పార్టీల్లోనూ ఉత్కంఠ నెలకొంది. దీపావళి తరువాత చైర్మన్ ఎన్నికకు అడ్డంకులు తొలగవచ్చని భావిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్

నేను మీ ఇంటి మనిషిని

మీ ఆదరణకు రుణపడి ఉంటా: మంత్రి సత్యకుమార్

అభివృద్ధికి గ్రహణం వీడింది: టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

బత్తలపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నేను ఎమ్మెల్యేను కాదు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటి కుటుంబ సభ్యుడిని' అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. మండలంలోని మాల్యవంతం గ్రామంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో మాత్రమే పల్లె పండుగలు జరుగుతున్నాయన్నారు. ఎక్కడి నుంచో వచ్చిన తనను కేవలం 39రోజుల పరిచయంతోనే ఆదరించి, గెలిపించారన్నారు. నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు.

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో 13326 గ్రామసభల్లో రూ.4500కోట్ల అంచనాతో 30వేల పనులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. గతంలో ఇక్కడ పనిచేసిన వైసీపీ ఎమ్మెల్యే గ్రామాలలో కక్షలు పెంచి, ప్రజలకు ప్రశాంతత లేకుండా చేశాడని ఎద్దేవా చేశారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అభివృద్ధికి పట్టిన గ్రహణం కూటమి ప్రభుత్వం రాకతో వీడిందని తెలిపారు. వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా ప్రధాన రహదారులు గుంతలుగా, పల్లెల్లో వీధులన్నీ బురదగా ఉండేవని తెలిపారు. వీటిని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బాగు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, గోనుగుంట్ల విజయకుమార్, కమతం కాటమయ్య, మహేష్, నారాయణరెడ్డి, చల్ల శ్రీనివాసులు, ఉమాపతి, కేశవ, విశ్వనాథ్, సంగాలసూరి, సురేంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.



పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి ఉధృతి

చిందులు తొక్కిన చిత్రావతి

ధర్మవరం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుల నాగేపల్లి వద్ద చిత్రావతి నది శనివారం ఉధృతంగా ప్రవహించింది. గత నాలుగు రోజుల నుంచి కురిసిన వర్షాలకు బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి మండలాల గ్రామాల నుంచి వర్షపు నీరు ధర్మవరం చెరువుకు చేరుతోంది. దీంతో నదికి నీటి ప్రవాహం పెరిగింది. ఈక్రమంలోనే పోతులనాగేపల్లి వద్ద నది ఉధృతంగా ప్రవహించడంతో కనంపల్లివాసులకు రాకపోకలు నిలిచిపోయాయి. వరుసగా కురిసిన వర్షాలకు పై ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపు నీరు మండలంలోని గొట్లూరు చెరువుకు చేరింది. దీంతో చెరువు మరువ పారుతోంది. గ్రామస్థులు తరలి వచ్చి గంగపూజ చేసి ఆనందం వ్యక్తం చేశారు. బోరు బావుల్లో కూడా భూగర్భజలాలు పెరిగి పంటలు పండించేందుకు అవకాశం ఏర్పడిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ బుక్కులు మాకొద్దు

గ్రామసభలో రైతులు

మడకశిర రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో భూ సర్వే చేసి ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలు వద్దంటూ పలువురు రైతులు పేర్కొంటున్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం కల్లుమర్రి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. సభకు హాజరైన రైతులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో కల్లుమర్రి పంచాయతీని మొదట ఎంపిక చేసి జగనన్న భూ సర్వే చేశారు. అనంతరం రైతులకు జగన్ ఫొటో ఉన్న పట్టాదారు పాసుపుస్తకం అందజేశారు. అందులో భూ వివరాలు అన్ని తప్పుగా ఉన్నాయని అప్పట్లోనే రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి సచివాలయం ఎదుట వాటిని కాల్చివేశారు. పక్కాగా సర్వేచేసి కొత్త పాసుపుస్తకాలు ఇవ్వాలని రైతులు తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేశారు. తహసీల్దారు కరుణాకర్ మాట్లాడుతూ భూ రికార్డులను పరిశీలించి రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు పూర్తి వివరాలతో వినతి పత్రాలు అందజేయాలని సూచించారు.



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

బ్యాంకులో రుణాలు తీసుకోలేకపోతున్నాం



వైసీపీ పాలనలో భూ సర్వేచేసి ఇచ్చిన పాసుపుస్తకాల్లో వివరాలు అన్నీ తప్పుగా ఉన్నాయి. భూములు ఎక్కువ ఉన్నవారికి తక్కువగా, తక్కువగా ఉన్నవారికి ఎక్కువగా పాసుపుస్తకాల్లో చూపించారు. దీని వల్ల బ్యాంక్‌లో రుణాలు పొందలేకపోతున్నాం.

- కన్నేరప్ప, రైతు, కల్లుమర్రి

మానవసేవే సాయిసేవ

సత్యసాయి సేవా సంస్థల ఉత్తర కర్ణాటక ప్రెసిడెంట్ పద్మనాభపాయ్

పుట్టపర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మానవసేవే సాయిసేవ అని సత్యసాయిబాబా చూపిన సేవా మార్గంలో పయనిస్తూ, సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని సత్యసాయి సేవా సంస్థల ఉత్తర కర్ణాటక ప్రెసిడెంట్ పద్మనాభపాయ్ పేర్కొన్నారు. సాయికుల్వంత్ సభా మంటపంలో శనివారం ఉత్తర కర్ణాటక భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదట సేవాసంస్థల అధ్యక్షుడు ఉత్తర కర్ణాటకలో చేపట్టిన సేవా కార్యక్రమాలు వివరించారు. సత్యసాయి బోధించిన మేరకు విద్యా, వైద్యం, తాగునీటి సేవలు అందిస్తున్నామన్నారు. 22 పాఠశాలలో 1000 మంది విద్యార్థులకు విద్యాజ్యోతి కార్యక్రమం ద్వారా విద్యను అందిస్తున్నామని, యువతకు సాంకేతిక విద్యపై పలు శిక్షణా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రముఖ సంగీత గాయని సంగీత రాజేశ్‌బండేఖర్ బృందం తమ గానంతో భక్తులను పరవశింపజేశారు. అనంతరం సేవా దళ్ బృందం భక్తిగీతాల ఆలాపన చేపట్టారు. గాయకులను ఆర్‌జే రత్నాకర్ ఘనంగా సత్కరించారు.







మాట్లాడుతున్న పద్మనాభపాయ్, సంగీత కచేరి నిర్వహిస్తున్న సంగీత రాజేశ్ బండేఖర్, పాటలు పాడుతున్న భక్తులు

సంక్షిప్తం

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

అధికారులకు మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక రాంనగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఐదు మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ, చెరువుల అంశాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మురళీధర్‌రావు, డీఈ సఫ్రీన్, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ నాగరాజ, ఈఈలు పాల్గొన్నారు.

10 నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నవంబరు 10 నుంచి 15వరకు కడప డీఎస్‌ఏ స్టేడియంలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నారని, జిల్లా అభ్యర్థులు హాజరుకావాలని కలెక్టరు వినోద్‌కుమార్ సూచించారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్ ఆఫీస్ అసిస్టెంట్స్, స్టోర్ కీపర్ టెక్నికల్స్, అగ్నివీర్ 10వ తరగతి ట్రేడ్‌మెన్, 8వ తరగతి ట్రేడ్‌మెన్‌కు రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రాలు, అడ్మిట్‌కార్డులు తీసుకుని ర్యాలీలో పాల్గొవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హత గలవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హంద్రీనీవా ఎస్‌ఈగా నాగరాజ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ప్రాజెక్ట్ ఎస్‌ఈగా నాగరాజ నియమితులయ్యారు. జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈగా ఉన్న నాగరాజకు హంద్రీనీవా ఎస్‌ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకు ఎస్‌ఈగా ఉన్న దేసేనాయక్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయన ఆదివారం రిలీవ్ కానున్నారు. సోమవారం హంద్రీనీవా ఇన్‌చార్జి ఎస్‌ఈగా నాగరాజ బాధ్యతలు తీసుకుంటారు. హంద్రీనీవా డివిజన్-7 ఈఈగా డీఈ శ్రీనివాసులుకు, పెనుకొండ ఐబీ డివిజన్ ఈఈగా రాధాకృష్ణ, కదిరి డివిజన్ 11 ఈఈగా గంగాధర్‌ను నియమించారు.

గుంతకల్లు-చిగ్జాజుర్ ప్యాసింజరు రద్దు

గుంతకల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిగ్జాజుర్-గుంతకల్లు-చిగ్జాజుర్ ప్యాసింజరు (07585/86) రైలును డిసెంబరు రెండో వారం వరకూ రద్దుపరచనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ రైల్వే డివిజన్‌లోని చిత్రదుర్గ-బేలేనహళ్లి సెక్షన్‌లో జరుగుతున్న పనుల కారణంగా అక్టోబరు 20 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకూ (మధ్యలో కొన్ని తేదీలు మినహా) రద్దుపరచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అక్టోబరు 21, 26, 28, నవంబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30, డిసెంబరు 2, 7, 9 తేదీలలో మినహా మిగతా రోజుల్లో ఈ ప్యాసింజరు రైలును రద్దుపరిచామన్నారు.

లా కోర్సు కౌన్సెలింగ్ నిర్వహించాలి

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : లా కోర్సు ప్రవేశాల కౌన్సెలింగ్‌ను త్వరతగతిన నిర్వహించాలని నేచురల్ జస్టిస్ లీగల్ ఎయిడెడ్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనితను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ సంఘం సభ్యులు పణిభూషణ, చంద్రభాస్కర్ మాట్లాడుతూ అడకమిక్ క్యాలెండర్ మేరకు గత నాలుగు సంవత్సరాలుగా న్యాయ విద్య ప్రవేశాలు కల్పించడంలేదన్నారు. అడ్మిషన్స్ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాఠ్యాంశాలను తూతూ మంత్రంగా పూర్తిచేసి పరీక్షలు నిర్వహిస్తుండటంతో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, జయరాజు, మధు పాల్గొన్నారు.

రీజనల్ కో ఆర్డినేటర్‌గా మిథున్‌రెడ్డి

అనంతపురం క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉమ్మడి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్‌గా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి అనంతపురం, నెల్లూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా మిథున్‌రెడ్డిని నియమించినట్లు అందులో పేర్కొంది. గతంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రీజనల్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఎన్నికల అనంతరం వైవీ సుబ్బారెడ్డి పేరును ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. చివరికి మిథున్ రెడ్డిని నియమించారు.

కందికి తెగుళ్ల దెబ్బ



పూర్తిగా ఎండిన కంది మొక్కలు

> ఉరవకొండ నియోజకవర్గంలోని నల్లరేగడి భూముల రైతులు నిత్యం పప్పుశనగ పంట సాగుచేస్తుంటారు. వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టాల పాలవుతుండడంతో ఈసారి చాలా మంది రైతులు పంట మార్పిడి చేసి చూద్దామని కంది పంట సాగుచేశారు. మొదట బాగా పెరిగిన పంటకు పూతదశలో విల్ట్, ఆకుమచ్చ తెగుళ్లు సోకడంతో ఎండిపోతోంది. దీంతో రైతులు మరోసారి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
>
> - విడపనకల్లు, ఆంధ్రజ్యోతి)

వందల ఎకరాల్లో ఎండుతున్న పంట

విల్ట్, ఆకుమచ్చ తెగుళ్లతో భారీ నష్టం

అధిక తేమతో కుళ్లుతున్న వేర్లు

ప్రతి ఏటా పప్పుశనగ సాగు చేసే రైతులు ఈసారి ఎక్కువగా కంది పంట సాగు చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, కూడేరు మండలాల్లో గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి కంది వైపు మొగ్గు చూపారు. ఎటు చూసినా కంది పైరు కనిపిస్తోంది. పప్పుశనగపై ఆశలు వదులుకుని కందిని సాగు చేస్తే అదికూడా విల్ట్ తెగులుతో ఎండిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కంది పంట సాగు చేసి ఇప్పటికే మూడు నెలలయింది. ప్రస్తుతం పూత దశలో ఉండగా అధిక వర్షాలతో వేర్లు కుళ్లి పోతున్నాయి. ఇది విల్ట్ తెగులు అని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. విడపనకల్లు, వజ్రకరూరు, మండలాల్లో పైరు ఎండి పోతోంది. కొన్ని గ్రామాల్లోని పొలాల్లో సాళ్లకు సాళ్లు కంది మొక్కలు పూర్తిగా ఎండి పోయాయి. మాళాపురం గ్రామం వద్ద రామాంజనేయులు అనే రైతు పొలంలో కందికి విల్ట్ తెగులు సోకి పూత దశలో ఉన్న పంట ఎండి పోయింది. వేర్లు కుళ్లి పోయి మొక్కలు ఎండుతున్నాయి. చీకలగురికి గ్రామంలో హంద్రీనీవా కాలువ వైపు, ఎర్రనేల పొలాల్లోను కంది ఎండి పోతోంది. దీనికి తోడు పచ్చపురుగు ఆశించడంతో మొక్కలకు ఉన్న ఆకులు మొత్తం రంధ్రాలు పడిపోతున్నాయి. వివిధ రకాల రసాయనిక మందులు వాడినా విల్ట్ తెగులు, పచ్చపురుగు తగ్గటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజక వర్గంలో 69,627 వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. గతంలో మిరప పంటకు విల్ట్ తెగులు సోకి వేల ఎకరాల్లో నష్టాల పాలయ్యారు.

మొక్కలు ఎండి పోతున్నాయి



రెండు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను పచ్చపురుగుతో కొంత, విల్ట్ తెగులుతో కొంత ఎండి పోతోంది. ఎన్ని మందులు వాడినా విల్ట్ ఆదుపు కావటంలేదు. చేసేది లేక ఎండిన మొక్కలను తొలగించి పొలం గట్టుకు వేస్తున్నాం. ఇది ఇలాగే ఉంటే ఎకరాలకు ఎకరాలు ఎండిపోయి పూర్తిగా నష్టపోతాం. పంటల బీమా కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఎ. ఓబుళేసు, మాళాపురం

అధిక రసాయనిక ఎరువుల వల్లే తెగుళ్లు

రైతులు తమ పొలాల్లో అధిక రసాయనిక ఎరువులు వాడకం వల్లే విల్ట్ తెగులు సోకుతోంది. పంట సాగుకు ముందు పొలాల్లో పశువుల ఎరువులు వాడడం లేదు. ఈసారి కంది పంటకు సోకిన తెగులును నివారించడం సాధ్యం కాదు. విల్ట్ తెగులు నివారణకు వేసవి సేద్యంలో ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పేడ ఎరువును వాడాలి. టన్ను పేడ ఎరువుకు 10 కిలోల ట్రైకో డెర్మ వెరడిని వాడాలి. ట్రైకో డెర్మవెరడిని పేడ ఎరువులో 21 రోజులు నానబెట్టిన తరువాత పొలంలో చల్లుకోవాలి. వేసవిలో లోతు దుక్కులు చేసుకుంటే వైరస్‌ను నివారించవచ్చు. విల్ట్ తెగులు సోకిన మొక్కలను తొలగించి పొలం గట్లపై వేసి కాల్చి బూడిద చేయాలి. లేదంటే వైరస్ మొత్తం పొలంలోని మొక్కలకు సోకే అవకాశం ఉంది. అధిక దిగుబడులు రావాలని విచ్చలవిడిగా ఎరువులు వాడటం వల్లే పంటలు ఎండుతున్నాయి.

- హెచ్.పెన్నయ్య, మండల వ్యవసాయ అధికారి, విడపనకల్లు



కుళ్లిన వేర్లు



రంధ్రాలు పడిన ఆకులు

పంట మార్చినా నష్టాలే



నేను ఐదెకరాల్లో కంది పంట సాగు చేశాను. వర్షాలు అధికంగా రావటం, తేమ ఎక్కువ కావటంతో పైరు ఎండి పోతోంది. బూడిద తెగులు, విల్ట్ తెగులు అంటున్నారు. గతంలోను మిరప పంటకు విల్ట్ తెగులు సోకి లక్షల్లో నష్టాలు పాలయ్యాం. ఇప్పుడు పంటలను మార్పు చేసి కందిని సాగు చేసినా విల్ట్ వదలటం లేదు. ఎక్కపడితే అక్కడ కంది మొక్కలు ఎండి పోతున్నాయి. ఏమి చేయాలో తెలియడం లేదు.

- జి.విజయ్, వి.కొత్తకోట

ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు



నేను ఎనిమిది ఎకరాల్లో కంది పంటను సాగు చేశాను. నెల రోజుల నుంచి కంది పైరు ఎండుతోంది. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకుండా పోతోంది. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఉన్నట్లుండి ఎండిపోతుండడంతో ఏమి చేయాలో తెలియక అలాగే వదిలేశాను. ప్రతి ఏటా పప్పుశనగ సాగు చేసేవాడిని, ఈసారి పంట మార్పిడి చేస్తే బాగుంటుందని అందరితో పాటు కంది సాగు చేస్తే విల్ట్ తెగులు సోకి ఎండుతోంది.

- ఎం.రామాంజనేయులు, పెద్ద కొట్టాలపల్లి

నిలకడలేని టమోటా ధరలు

ఊరించి ఉసూరుమనిపిస్తున్న వైనం

మొన్నటి వరకు 16 కిలోల బాక్స్ రూ.800 నుంచి రూ.1000

నేడు రూ. 350 నుంచి రూ.400కు పతనం





టమోటాను బాక్సుల్లోకి నింపుతున్న కూలీలు

కళ్యాణదుర్గం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షం దెబ్బకు టమోటా ధరలు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయి. మొన్నటి వరకు అనంతపురం, కర్ణాటకలోని కోలార్ టమోటా మార్కెట్లలో 16 కిలోల బాక్స్ ధర రూ.800 నుంచి రూ.1000 వరకు పలికాయి. అవే ఇప్పుడు రూ. 350 నుంచి రూ. 400 పడిపోయాయి. ఈ ధరలు ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నాయి. వారం రోజుల వ్యవధిలోనే అమాంతంగా ధరలు పడిపోయాయి. ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 390 ఎకరాలకు పైగా టమోటా సాగు చేశారు. ఎకరాకు రూ. లక్ష వరకు ఖర్చు చేసి, ఒక్కొక్క రైతు సరాసరి రెండున్నర ఎకరాలకు పైబడి సాగు చేశారు. టమోటా పంటలన్నీ కోతకు వస్తున్న సమయంలో ఇలా ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి కూడా అమాంతంగా పెరగడంతో మార్కెట్లకు భారీగా టమోటా చేరుతోంది. వర్షం దెబ్బతో బంగ్లాదేశ్‌కు ఎగుమతి నిలిపివేయడంతోనే ధరలు నిలకడగా ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. టమోటా కొనుగోలుకు మొన్నటి వరకు వ్యాపారులు ఎగబడ్డారు. ధ రలు ఇలాగే ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. వారం రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం తగ్గుముఖం పట్టాయి.

వారంలోనే తగ్గిన ధరలు



నాకున్న మూడు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశాను. వారం రోజుల క్రితం 16 కిలోల టమోటా బాక్స్ ధర రూ.800 నుంచి రూ.1000 వరకు అమ్ముడుపోయింది. అదే ధర ఇప్పుడు రూ. 350 నుంచి రూ.400కు పడిపోయింది. ఇలా ధర ఒక్కసారిగా పడిపోవడంతో భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నాం.

- నగేష్, కరిగానిపల్లి



తోటలోనే మాగిపోయిన టమోటా

వర్షం దెబ్బతోనే పతనం



గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం దెబ్బకు టమోటా ధర పడిపోతోంది. ఈ ధరలు ఇలాగే ఉంటే పెట్టుబడి కూడా రాదు. నాకున్న రెండు ఎకరాల్లో సుమారు రూ. 2 లక్షలు వరకు ఖర్చు చేసి టమోటా పంటను సాగు చేశాను. మొన్నటి వరకు రూ. 800కు పైబడి 16 కిలోల బాక్స్ కొన్నారు. ప్రస్తుతం రూ. 400కు పడిపోయింది. పడిలేస్తున్న ధరలు చూస్తే మాలాంటి చిన్నకారు రైతుల పరిస్థితి ఏమి కావాలో అర్థం కాలేదు.

- హరీష్, కరిగానిపల్లి

యాపారం జోరు..!

అంగన్‌వాడీ పోస్టుల చుట్టూ బేరాలు

రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ

జిల్లా వ్యాప్తంగా 84 పోస్టులు ఖాళీలు

23 నుంచి ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'యాపారం' జోరందుకుంది. ఒక్కో పోస్టు లక్షలు పలుకుతోంది. కొందరు మధ్యవర్తులు, దళారులు అధికార పార్టీ నాయకులు కొందరిని అడ్డుపెట్టుకుని అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు బేర సారాలు ఆడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల్లో 84 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెల 23 నుంచి అభ్యర్థులకు రెవెన్యూ డివిజన్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అయితే చాలా చోట్ల అభ్యర్థులకు పోస్టులు ఇప్పిస్తామని మధ్యవర్తులు బేరాలు ఆడుతున్నారు. రూ. 2 లక్షల నుంచి రూ. 5లక్షల వరకూ పోస్టులను, సెంటర్‌ను బట్టి రేట్ ఫిక్స్ చేసి బేరాలు ఆడుతున్నారు. దీంతో పోస్టులు ఏమేరకు పారదర్శకంగా భర్తీ అవుతాయనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

అంగన్‌వాడీ పోస్టులకు 303 దరఖాస్తులు

అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గతనెలలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 1వ తేదీ వరకూ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు 303 దరఖాస్తులు వచ్చాయి. 9 వర్కర్ పోస్టులకు 68 దరఖాస్తులు, నాలుగు మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 11 దరఖాస్తులు, 71 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు 224 దరఖాస్తులు వచ్చాయి. డివిజన్ల వారీగా పరిశీలిస్తే... అనంతపురం డివిజన్‌లో 102 దరఖాస్తులు, గుంతకల్లు డివిజన్‌లో 66 దరఖాస్తులు, కళ్యాణదుర్గం డివిజన్‌లో 56 దరఖాస్తులు వచ్చాయి.

23 నుంచి ఇంటర్వ్యూలు...

అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 23 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అనంతపురం రెవెన్యూ డివిజన్‌పరిధిలోని అభ్యర్థులకు 23న ఉదయం 10 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు చేస్తారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు 24న ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు 25న ఉదయం 10 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

ప్రాజెక్టుపేరు	పోస్టులు
అనంతపురం అర్బన్	8
శింగనమల	6
నార్పల	9
అనంతపురం రూరల్	10
తాడిపత్రి	14
గుత్తి	5
ఉరవకొండ	12
కళ్యాణదుర్గం	6
కణేకల్లు	5
కంబదూరు	7
రాయదుర్గం	2
మొత్తం 11 ప్రాజెక్టులు	84

రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచే బేరాలు ఊపందుకున్నాయి. అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు సగటున రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకూ బేరాలు సాగుతున్నాయి. కొన్ని చోట్ల రూ. 5 లక్షలు కూడా పలుకుతోంది. మినీ వర్కర్ పోస్టుకు సైతం రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలు వరకూ నడుస్తోంది. ఆఖరికి ఆయా పోస్టుకు సైతం రూ. 2 లక్షలు, ఆపైన కూడా రేట్ ఫిక్స్ చేసి దళారులు బేరాలు సాగిస్తున్నారు. శింగనమల, తాడిపత్రి, అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, కణేకల్లు, గుత్తి, కంబదూరు, రాయదుర్గం, నార్పల, కళ్యాణదుర్గం ఇలా ప్రతి ప్రాజెక్టు పరిధిలో కొందరు దళారులు, ద్వితీయశ్రేణి నాయకులు కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో సిఫార్సు లెటర్లు ఇప్పిస్తామని, ఐసీడీఎస్ అధికారులకు ఫోన్లు చేయిస్తామని చెప్పి భారీగా బేరాలు సాగిస్తున్నాయి. కొందరు సంఘాల నాయకులు కూడా ఇందులో తలదూర్చి చక్రం తిప్పాలని చూస్తున్నారు. అభ్యర్థుల ఇంటర్వ్యూలకు మరో మూడు రోజులు మాత్రమే సమయం ఉండటంతో...ఈ బేరాలు జోరందుకున్నాయి. మరి అధికారులు ఏ మేరకు పాదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారో? అక్రమాలను ఏ విధంగా కట్టడి చేస్తారో చూడాలి.



ఐసీడీఎస్ పీడీ కార్యాలయం

ఏసీబీకి ఫిర్యాదు చేయండి

పోస్టులను పారదర్శకంగా భార్తీ చేస్తాం. అభ్యర్థులను ఎవరైనా డబ్బులు అడిగి ప్రలోభ పెడితే వెంటనే ఏసీబీ అధికారులు ఫిర్యాదు చేయండి. అభ్యర్థులు నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించవచ్చు.

- శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ

చూసొద్దాం రండి..!

డ్యాం చూద్దాం.. చేప తిందాం..



నూరూరించే చేపలు పులుసు, చేపల రోస్ట్

కూడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఒత్తిడితో కూడిన జీవనం నుంచి కాస్త రిలాక్స్ కోసం చాలా మంది ఏదో ఒక పిక్నిక్‌కు వెళ్లాలని భావిస్తుంటారు. అలాంటి వారికి పీఏబీఆర్ డ్యాం మంచి ఆప్షన్‌గా కనిపిస్తోంది. ఇక్కడ నిండుగా కనిపించే నీటిని చూసి పిల్లలు, పెద్దలు ఉల్లాసం పొందుతారు. ముఖ్యంగా ఇక్కడ ఇక్కడ దొరికే చేపలతో తయారు చేసే పులుసు, రోస్టు ఎంతో రుచికరంగా ఉంటుంది. పీఏబీఆర్ డ్యాంలో చేపలను తిన్న వారు ఆ రుచికి ఫిదా అవాల్సిందే. డ్యాంను చూడటానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చేపలతో వివిధ రకాల వంటకాలు తయారు చేయించుకొని అక్కడే ప్రశాంతంగా భోంచేస్తుంటారు. మరికొందరు ఇంటికి పార్సల్ తీసుకెళ్తారు. సెలవు రోజుల్లో డ్యాం వద్దకు పదుల సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాల్లో సందర్శకులు వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడి, పాడి అలసి ఇంటికి వెళ్తుంటారు. మరి కొందరు ఇక్కడే పుట్టినరోజు వేడుకలు సైతం జరుపుకుంటుంటారు. మరి మీకు వెళ్లాలని ఉంటే కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఓ రోజు వెళ్లి సరదాగా గడిపేయండి.



సిద్ధం చేస్తున్న తయారీదారులు

అమ్మపేరుతో మొక్క నాటాలి

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



మొక్కలు నాటుతున్న సత్యకుమార్ యాదవ్, లాల్‌సింగ్ ఆర్య, గుడిసె దేవానంద్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ వారి అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి పెంచాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'అమ్మ పేరుతో ఒక మొక్క' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మందల శాంతకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మంత్రి సత్యకుమార్ యాదవ్‌తోపాటు జాతీయ దళిత మోర్చా అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య, రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అకాల వర్షాలు తదితర వాటిని నియంత్రించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. స్ఫూర్తిదాయకంగా ప్రధాని మోదీ మొక్కనాటి తన తల్లి హీరాబెన్ పేరును నామకరణం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకేశివశంకర్, జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, సూర్య, నాగేంద్ర, జయలక్ష్మి, రామ్‌దాస్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తుంగభద్ర.. నిండు కుండ



నీటితో నిండుగా ఉన్న తుంగభద్ర

బళ్లారి సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతోంది. డ్యాంలో 101.42 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఎగువ నుంచి 73,241 క్యూసెక్కుల వరద నీరు డ్యాంలోకి చేరుతోంది. దిగువకు 74,025 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో 11వేల క్యూసెక్కుల నీరు కాల్వలకు, 63 వేల క్యూసెక్కుల నీరు నదిలోకి వెళుతోంది. ఇన్‌ఫ్లో పెరిగితే లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు. జలాశయ పరివాహక ప్రాంతాలైన ఆగుంబె, శివమొగ్గ, హొసపేట తదితర చోట్ల వర్షాలు బాగా కురుస్తున్నాయి. గత వారంలో జలాశయానికి ఇన్‌ఫ్లో 84వేల క్యూసెక్కులు ఉండగా ఈవారం తగ్గింది. ఈ సంవత్సరం రెండో పంటకు కూడా నీరు పుష్కలంగా లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఆదుకోండి..!

వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి

చెరువులకు హంద్రీనీవా నీరు ఇవ్వండి

ప్రభుత్వానికి జిల్లా పరిషత్ సభ్యుల వినతి

పింఛన్ల తొలగింపుపై వైసీపీ సభ్యులతో వాగ్వాదం

కొత్తగా 15 లక్షల పింఛన్లు ఇస్తామన్న మంత్రి సత్యకుమార్

శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, అధికారుల గైర్హాజరుపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం విద్య, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తుఫాను, అధిక వర్షాల కారణంగా పొలాల్లో పంటలు దెబ్బతింటున్నాయని, రైతులను ఆదుకోవాలని జిల్లా పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు. వేరుశనగ, పత్తి, కొర్ర, మిర్చి తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టపోతున్నారని, వారికి పరిహారం ఇవ్వాలని మంత్రిని, జిల్లా కలెక్టర్‌ను కోరారు. మెజార్టీ చెరువులకు నీరు ఇవ్వాలని కోరారు. పింఛన్ల రద్దు అంశంపై వైసీపీ జడ్పీటీసీలు, మడకశిర ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం జరిగింది. అనర్హుల పింఛన్లను రద్దు చేస్తారని, కూటమి ప్రభుత్వం కొత్తగా 15 లక్షల పై చిలుకు కొత్త పింఛన్లు ఇస్తోందని మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రధానంగా ఈ రెండు అంశాలపై రెండున్నర గంటలపాటు చర్చ సాగింది. చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన 11వ సర్వసభ్య సమావేశం జడ్పీ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. సుమారు గంటన్నర ఆలస్యంగా సభ ప్రారంభమైంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఇద్దరు ఎమ్మెల్యేలు మినహా, మెజార్టీ ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, జేసీ, వివిధ శాఖల అధికారులలో సగం మంది సభకు రాలేదు. వారిపై చైర్ పర్సన్, మంత్రి అసహనం వ్యక్తం చేశారు. అధికారులందరూ వచ్చే సమావేశానికి హాజరయ్యేలా చూస్తామని సభ్యులకు మంత్రి హామీ ఇచ్చారు.

అన్నదాతలకు ఆసరా..

ఉమ్మడి జిల్లా రైతులు అనేక రకాలుగా నష్టపోతున్నారని జడ్పీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. వర్షాల వల్ల పొలాల్లో పంటలకు మొలకలు వస్తున్నాయని అమడగూరు, గుమ్మఘట్ట, విడపనకల్లు జడ్పీటీసీలు అన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. పరిగి చెరువుకు మరమ్మతులు చేయించాలని ఆ మండల జడ్పీటీసీ కోరారు. కంది విత్తనాలను మోతాదును పెంచాలని యల్లనూరు జడ్పీటీసీ కోరారు. అడవి పందులు, ఇతర జంతువుల నుంచి పంటలకు రక్షణ కల్పించాలని లేపాక్షి జడ్పీటీసీ కోరారు. ఎరువుల కోసం డబ్బులు చెల్లించినా తమ మండలంలో సరఫరా చేయలేదని కంబదూరు జడ్పీటీసీ సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రాల్లో డబ్బులు చెల్లించని అధికారులపై కఠిన చర్యలు జేడీఏని ఆదేశించారు. ఏవో, ఏడీ వెంటనే కంబదూరు మండలంలో పర్యటించి, పరిస్థితిని తనకు తెలియజేయాలని కోరారు. యల్లనూరులో పప్పుశనగ దిగుబడులను కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వడంలేదని, మూడేళ్లుగాను తాను సభ దృష్టికి తెస్తున్నా న్యాయం జరగలేదని జడ్పీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రైతులకు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మార్కెడ్ ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతపురం బైపాస్ నుంచి టమోటా మండీలకు వెళ్లే రహదారిలో ట్రాఫిక్ సమస్య ఉందని, కక్కలపల్లికి వెళ్లాలంటే గంట పడుతోందని అనంతపురం రూరల్ జడ్పీటీసీ సభ దృష్టికి తీసుకొచ్చారు. డబుల్ రోడ్డు పనులు వెంటనే జరిగేలా చూడాలని కోరారు. సర్వే నంబర్ 83లో సమాధులను తవ్వేసి కొట్టాలు వేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సిద్దరాంపురం చెరువుకు నీరు ఇవ్వాలని జడ్పీ వైస్ చైర్మన్ నాగరత్న అధికారులను కోరారు.


సభకు హాజరైన సభ్యులు

పింఛన్లపై రగడ


ఫించన్ల అంశంలో ఎమ్మెల్యే రాజు, వైసీపీ జడ్పీటీసీల మధ్య వాగ్వాదం

కంబదూరు, గుమ్మఘట్ట, యల్లనూరు, అనంతపురం రూరల్, కనగానపల్లి జడ్పీటీసీలు, కొందరు ఎంపీపీలు పింఛన్ల రద్దు గురించి ప్రశ్నించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కలుగజేసుకుని, అనర్హులవి మాత్రమే తొలగిస్తారని అన్నారు. మూడు నెలలలో 5908 వృద్ధాప్య పింఛన్లు, 519 దివ్యాంగుల పింఛన్లను తొలగించారని చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. ఈ క్రమంలో వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనర్హుల పింఛన్లను తొలగించి, తమ ప్రభుత్వం కొత్తగా 15 లక్షల పింఛన్లు ఇవ్వనుందని ఎమ్మెల్యే అన్నారు. లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చినంత మాత్రాన పింఛన్ రద్దు కాదని, రద్దుకు సహేతుక కారణాలను డీఆర్‌డీఏ, పింఛన్ పంపిణీ అధికారులు (పీడీఓ) లబ్ధిదారులకు వివరించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూండా చూడాలని అధికారులను ఆదేశించారు.

సమస్యలను పరిష్కరిస్తాం: మంత్రి సత్యకుమార్



సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. చెరువులకు నీటి విడుదలపై నీటిపారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయి స్పష్టత ఇవ్వాలని సూచించారు. పీఎంజీఎస్‌వై 3.0 ప్రస్తుతం నడుస్తోందని అన్నారు. గ్రామీణ రహదారులకు కేంద్రం భారీగా నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు గ్రామీణ రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్ కనెక్టివిటీ లేకుండా ఒక్క గ్రామం కూడా ఉండకూడదని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, అధికారులు గైర్హాజరుపై తాను కూడా విచారిస్తానని, వచ్చే సమావేశానికి హాజరుకావాలని ఆదేశిస్తామని అన్నారు. గత ప్రభుత్వం సర్పంచులకు చెక్ పవర్ లేకుండా చేసిందని, ఈ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషిస్తోందని అన్నారు. గ్రామాలకు రూ.4500 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. పింఛన్లపై తనకూ ఫిర్యాదులు వచ్చాయని, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందుతాయని అన్నారు. కొత్తగా 15 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. పీహెచ్‌సీ సమస్యలపై రీ సర్వే చేయిస్తామని అన్నారు. జనాభా, ఇతర పరిస్థితులను బట్టి పీహెచ్‌సీల మంజూరు, డాక్టర్ల కొరత, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, శ్రీసత్యసాయి జిల్లా డీఆర్వో, ఉమ్మడి జిల్లాలోని పలు శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

- అనంతపురం నగరంలోని నడిమివంక, మరువ వంకలో పూడిక తియ్యనందుకే ఏడాదిన్నర క్రితం వరదలు వచ్చాయని, ప్రస్తుతం అన్ని వంకల్లో పూడిక తీస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వంకలకు రక్షణ గోడలను నిర్మించడంపై దృష్టిసారిస్తామని అన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధంపై గ్రామస్థాయి నుంచి కసరత్తు చేయాలని అన్నారు. దీనిపై జడ్పీ పాలకవర్గం తీర్మానం చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. మండలాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని కొందరు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. జడ్పీ చైర్ పర్సన్ కూడా ఇదే అంశంపై పెదవి విరిచారు. ప్రొటోకాల్ పాటించేలా సర్క్యులర్ జారీ చేస్తామని జడ్పీ సీఈఓ అన్నారు.

చెరువులకు నీరివ్వండి..

- హంద్రీనీవా ద్వారా తమ ప్రాంతంలోని చెరువులకు నీరు ఇవ్వాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర కోరారు. 2014-2019 మధ్య చెరువులకు నీరు ఇచ్చారని, ఆ తర్వాత రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలలో చెరువులకు నీరు ఇవ్వాలని, చెరువులకు మరమ్మతులు చేయించాలని కోరారు.
- మడకశిర నియోజకవర్గం సముద్రమట్టానికి చాలా ఎత్తులో ఉందని, తమ ప్రాంత చెరువులకు గత ఐదేళ్లలో చుక్కనీరు ఇవ్వలేదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తాగునీటి సమస్య కూడా ఉందని, వెంటనే నీరు ఇవ్వాలని అధికారులను కోరారు.

అధికారులు ఎక్కడ..?

- శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారుల గైర్హాజరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీటీసీలు సమస్యలపై ప్రశిస్తే సమాధానం చెప్పడానికి కలెక్టర్, ఉన్నతాధికారులు లేకుంటే ఎలా అని మడకశిర ఎమ్మెల్యే అన్నారు. తాము సభలో ఏం మాట్లాడినా ప్రయోజనం ఉండదని అన్నారు. ఎమ్మెల్యేలు వచ్చినా జిల్లా అధికారులు రాకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఇది ఉమ్మడి జిల్లా జడ్పీ సమావేశమా..? లేక ఒక జిల్లా సమావేశమా..? అని మండిపడ్డారు. అధికారుల తీరుపై చైర్ పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ జిల్లా కలెక్టర్‌తో తాను మాట్లాడుతానని, వచ్చే సమావేశానికి వారం ముందు తన దృష్టికి తీసుకురావాలని జడ్పీ సీఈఓకు అనంత కలెక్టర్ సూచించారు. అధికారులు అందరూ హాజరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.
- పీహెచ్‌సీల్లో వైద్యుల కొరతను మెజార్టీ జడ్పీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. బ్రహ్మసముద్రం పీహెచ్‌సీలో నాడు-నేడు పనులపై విచారణ చేయాలని జడ్పీటీసీ కోరారు. నార్పల పీహెచ్‌సీని గైనకాలజిస్టును ఇవ్వాలని జడ్పీటీసీ కోరారు. కొత్త చెరువుకు పీహెచ్‌సీ అవసరం ఉందని, మంజూరు చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర కోరారు. శెట్టూరు, లేపాక్షి జడ్పీటీసీలు పీహెచ్‌సీ సమస్యలను సభదృష్టికి తీసుకొచ్చారు.

బీటీపీకి పెరుగుతున్న వరద


బీటీ ప్రాజెక్టులో నీరు

గుమ్మఘట్ట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భైరవానితిప్ప రిజర్వాయర్‌కు వరదనీరు పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం రెండు టీఎంసీలు (1655 అడుగులు). కాగా శనివారం సాయంత్రానికి 1.2 టీఎంసీల నీరు (1649.4 అడుగులకు) చేరింది. కర్ణాటక పరిసర ప్రాంతాల్లో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు వేదవతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టుకు వరదనీటి ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టు కింద 12వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టులో నీరు చేరుతుండటంతో ఆయకట్టు రైతుల్లో హర్షాతీరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉర్దూభాషాభివృద్ధి, సాహిత్యంలో విశేష సేవలందించిన వారు జాతీయ, ప్రాంతీయ పురస్కారాలక దరఖాస్తు చేసుకోవాలని జిల్లామైనారిటీ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరక్టర్ రామసుబ్బారెడ్డి శనివారం ఓప్రకటనలో తెలిపారు. నవంబరు 11న మైనారిటీ వెల్ఫేర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మౌలానాఅబుల్ కలాం ఆజాద్ జాతీయపురస్కారం, డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ పురస్కారాలు అందజేస్తామన్నారు. మౌలానాఅబుల్ కలాం ఆజాద్ పురస్కారం కింద 1.25లక్షలు, సర్టిఫికెట్, మెమెంటో, డాక్టర్ అబ్దుల్‌హఖ్ ప్రాంతీయస్థాయి పురస్కారం కింద రూ. లక్ష, సర్టిఫికెట్, మెమెంటో అందిస్తామన్నారు. రాష్ట్రానికి చెందిన ఉర్దూసాహితీవేత్తలు, పండితులు, కవులు, పాత్రికేయులు, విమర్శ, పరిశోధన, గద్యబోధన ఉర్దూ సేవలకు సేవలందించిన ఆరుగురికి జీవితకాల సాఫల్యపురస్కారాలు అందచేస్తామని వెల్లడించారు. ఉర్దూ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. ఉర్దూ అకాడమీ జారీ చేసిన దరఖాస్తు ఫారాలను పూరించి డీఈఓ/డిప్యూటీ డీఈఓలకు ఈ నెల 25లోపు పంపాలన్నారు.

లక్కీ చాన్సులే

మద్యం షాపుల ద్వారా అదృష్టం

షాపు వదులుకోవాలని అరకోటి ఆఫర్



పుట్టపర్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొందరికి కిక్కుతో లక్కు కలిసి వస్తోంది. రెండు లక్షలు పెట్టుబడి పెడితే లచ్చిందేవి వచ్చి నట్టింట్లో నాట్యం చేస్తోంది. ఇదంతా లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్నవారి గురించే... జిల్లాలో 87 మద్యం షాపులుండగా వీటికి 1518 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఒక్కరే పది దరఖాస్తులు చేసిన వారుకూడా ఉన్నారు. లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వారు హుషారుగా ఉండగా, రానివారు లబోదిబోమంటున్నారు. స్థానికేతరులకు షాపులు దక్కడం స్థానికులకు దక్కకపోవడంతో మధ్యవర్తుల ద్వారా సంప్రదింపులతో షాపులు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ఆరుగురిని వరించిన అదృష్టం

ధర్మవరం ఎక్సైజ్ సర్కిల్లో ఒకరికే ఐదుషాపులు వచ్చాయి. మరో ముగ్గురికి ఒక్కొక్కరికి రెండు షాపులు దక్కాయి. పెనుకొండ సర్కిల్ ఓవ్యక్తికి రెండు షాపులు, మడకశిర పరిధిలో ఒకే కుటుంబానికి నాలుగుషాపులు, దక్కాయి. దీంతో ఆయా కుటుంబాల్లో ఆనందానికి హద్దే లేకుండా పోయింది.

అరకోటి ఆఫర్

కొంతమందికి ఒకటి కంటే ఎక్కువ షాపులు దక్కడంతో రెండోషాపు కోసం ఎక్కువమంది మాకంటే మాకు ఇవ్వాలని వెంటపడుతున్నారు. గుడ్‌విల్ ఎంతివ్వడానికైనా సిద్ధపడుతున్నారు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నా ఆలోచనతో షాపులు దక్కించుకున్నవారు అరకోటి ఇస్తే మాకు ఓకే అంటున్నట్లు సమాచారం. మరికొంతమంది షాపు ఇస్తాం. మీరే పెట్టుబడి పెట్టండి. లాభాల్లో భాగమివ్వండి అంటూ బేరసారాలు సాగిస్తున్నారు. మరి కొంతమంది ఎన్ని లక్షలైనా ఇస్తాం. షాపుమాకే ఇవ్వండి. గుడ్‌విల్ తీసుకోండని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది.

మహిళలదే అదృష్టం

మద్యాన్ని నిషేధించాలని ఉద్యమించిన మహిళలే ప్రస్తుతం మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకుంటుండటం గమనార్హం. అలా దరఖాస్తు చేసుకున్న వారిలో ఆరుగురిని అదృష్టం వరించింది. దీంతో వారి భర్తల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. దీన్ని చూసిన మరికొంతమంది మేము కూడా మా భార్య పేరుతో దరఖాస్తు చేసింటే లక్కు కలిసివచ్చేదేమోనని అభిప్రాయపడ్డారు.

జేబుకు చిల్లు

మద్యంషాపు దక్కితే లక్షలు సంపాదిద్దామని చాలామంది పోటీపడి మరి దరఖాస్తు చేశారు. కొంతమంది పది నుంచి ఇరవై షాపులకు అప్పులు చేసి మరీ దరఖాస్తు చేశారు. ఒక్క షాపు కూడా దక్కకపోవడంతో వారంతా లబోదిబోమంటున్నారు. పుట్టపర్తి సర్కిల్లో ఓవ్యక్తి భూమి అమ్మి పది మద్యంషాపులకు దరఖాస్తు చేశాడు. ఒక్క షాపుకూడా దక్కకపోవడంతో దిగాలుతో జబ్బుపడ్డాడు. హిందూపురం, ఓడీసీ, పెనుకొండ, పుట్టపర్తి పరిధిలో అత్యధికంగా దరఖాస్తులు చేసుకున్నవారికి షాపులు దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు.

విలేజ్ బ్రాండ్

పల్లెల్లో మినీ మద్యం షాపులు

అన్ని బ్రాండ్లు లభ్యం


శెట్టిపల్లిలో టీడీపీ నాయకులు ప్రారంభించిన మద్యం బెల్టు షాపు

చిలమత్తూరు, అక్టోబరు 19: ప్రభుత్వ నూతన మద్యం పాలసీతో గ్రామాల్లో మినీ మద్యం షాపులు (బెల్టు షాపులు) పుట్టుకొస్తున్నాయి. బెల్టు షాపుల పేరుతో ప్రధాన మద్యం షాపులో దొరికే అన్ని రకాలు మద్యం బాటిళ్లను అమ్మకాలకు పెట్టేశారు. దీంతో గ్రామాల్లో మద్యం ప్రియులు కావాల్సిన మద్యం కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఆయా గ్రామాల్లోనే కావాల్సిన బ్రాండ్లు, కావాల్సినంత మద్యం దొరుకుతోంది. ఈక్రమంలోనే ఈ మినీ మద్యం షాపులను నిర్వాహకులు అట్టహాసంగా ప్రధాన దుకాణానికి దీటుగా ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నారు. శాస్త్రోక్తంగా బ్రాహ్మణులను పిలిపించి పూజలు చేయించి మినీ దుకాణాలు ప్రారంభిస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కుతూ గ్రామాల్లో సైతం మినీ మద్యం షాపులు ఏర్పాటు చేస్తుండటంపై ఎక్సైజ్ పోలీసులు ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

నేలకొరిగిన ద్రాక్ష తోట


పడిపోయిన ద్రాక్ష పంట

కూడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని హంసాపల్లి గ్రామంలో ఓ ద్రాక్షతోట నెలకొరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెండెకరాల ద్రాక్ష తోట నేల కొరిగింది. ఐదు లక్షల పెట్టుబడి పెట్టి రెండెకరాల్లో ద్రాక్ష పంట సాగు చేశాడు. దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. అయితే మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి శనివారం తెల్లవారుజామున పందిరి సహా పంట మొత్తం నేలకొరిగింది. దీంతో దాదాపు రూ.15లక్షల వరకు పంట నష్టం జరిగిందని రైతు వాపోయాడు. పెట్టుబడి ఐదులక్షలు, పంట నష్టం మరో పది లక్షలుంటుందని రైతు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. హార్టికల్చర్ అధికారి నెట్టికంఠయ్య తోటను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

23న పిల్లలకు ప్రత్యేక వైద్య శిబిరం : డీఎంహెచ్ఓ


డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వినికిడిలోపం ఉన్నపిల్లలకు ఈనెల 23న ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ.దేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 0-నుంచి 19ఏళ్ల వయసు పిల్లలు వినికిడి లోపంతో ఇబ్బంది పడుతూ ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి వినికిడి యంత్రాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దీన్‌దయాళ్ శ్రవణా ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం జిల్లా ఆస్పత్రి ఆవరణలోని 99వ ఓపీ కేంద్రం (డీఈఐసీసెంటర్)లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, చెవి డాక్టర్ రాసిచ్చిన ఓపీ చీటీ, ఆడియాలజిస్ట్ రిపోర్ట్ వివరాలు తీసుకొని రావాలన్నారు. ఆయామండలాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు వినికిడి లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ఈ వైద్య శిబరంపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

డ్వామాలో ఇష్టారాజ్యం !

అప్పటి అధికారులదే నేటికీ హవా

నచ్చినవారికి నచ్చిన చోటుకు బదిలీ

కొత్త అధికారిని తప్పుదోవ పట్టిస్తున్న వైనం



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్రవిచిత్రాలకు డ్వామా వేదికగా మారింది. ఎంతో కీలకమైన హెచ్‌ఆర్, విజిలెన్స్ విభాగాల్లో అధికారులు వైసీపీ పాలనలో వ్యవహరించినట్లే ఇప్పుడు కూడా చేస్తున్నారు. అప్పుడు ఓ వెలుగు వెలిగిన అధికారులు నూతన ప్రభుత్వంలో కూడా తమ హవా కొనసాగిస్తున్నారు. రెండు నెలల కిందట ఎనిమిది మంది ఏపీఓలను బదిలీ చేయగా...వారిలో కొందరు నేటికీ విధుల్లో చేరలేదు. జీతాలు మాత్రం తీసుకుంటున్నారు. వీటి వెనుక ఆ అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొత్తగా వచ్చిన అధికారిని సైతం తప్పుదోవ పట్టిస్తూ తమకు నచ్చిన వారికి హెచ్‌ఆర్ విభాగం అధికారులు మేలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

హెచ్‌ఆర్, విజిలెన్స్ కీలకం

డ్వామాలో హెచ్‌ఆర్, విజిలెన్స్ విభాగాలే కీలకం. ఎటువంటి కిరికిరి జరిగినా అందులో ఈ రెండు విభాగాల పాత్ర ఉంటుంది. అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో ఈ రెండు విభాగాల నుంచే ఎక్కువ ప్రతిపాదనలు ఉంటాయి. వైసీపీ ప్రభుత్వంలో రికార్డుల్లో సీఆర్‌డీకి ఒక జాబితా, క్షేత్రస్థాయిలో మాత్రం వేరేవాళ్ల పేర్లు పెట్టారు. ఇదంతా హెచ్‌ఆర్ విభాగం ఘనతే. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నడూ లేనివిధంగా ఆరుగురు ఏపీఓలు పీడీ కార్యాలయంలో పనిచేయగా, మరో ఆరు మండలాల్లో ఇద్దరు చెప్పిన ఏపీఓలను నియమించారు. ఇలా సుమారు నాలుగేళ్లపాటు కొనసాగారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనుల కల్పనపై ప్రభావం చూపింది. డ్వామా పరిధిలో అమలు చేస్తున్న ఉపాధి, వాటర్‌షెడ్, జలకళ పథకాలలో జరిగిన అక్రమాలు, ఫిర్యాదులు అందితే వాటిని పరిశీలించి, పరిష్కరించడమే విజిలెన్స్ విభాగం ప్రధాన కర్తవ్యం. ప్రజావేదిక (ఓపెన్‌ఫోరం) ద్వారా నిధుల దుర్వినియోగం, అందుకు బాధ్యులను తేల్చాలి. ఈ ఓపెన్‌ఫోరం పెట్టినప్పుడు మాత్రమే విజిలెన్స్ విభాగంలోని ఓ అధికారి విధుల్లో ఉంటారు. అది అయిపోగానే సెలవులో వెళ్లిపోతారనే ప్రచారం ఆశాఖలో ఉంది. ఓపెన్ ఫోరం పేరుతో విజిలెన్స్ విభాగంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు మూటగట్టుకుంటున్న అధికారికే తిరిగి డ్వామాలోనే ఫైనాన్స్ మేనేజర్ పోస్టును అదనంగా తగిలించడం గమనార్హం.

కొత్త అధికారిని తప్పుదోవ పట్టిస్తూ బదిలీలు

డ్వామాకు కొత్తగా వచ్చిన పీడీని సైతం తప్పుదోవ పట్టిస్తూ తమకు నచ్చిన వారికి, ముడుపులు పుచ్చుకుని గుట్టుచప్పుడు కాకుండా బదిలీలు చేస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. తనకు తెలియకుండా ఏ ఒక్క ఉద్యోగిని బదిలీ చేయకూడదనే కలెక్టర్ ఆదేశాలను సైతం పక్కనపెట్టి హెచ్‌ఆర్ విభాగం అధికారుల బరితెగింపుతో స్థానచలనం చేస్తున్నారు. రెండు రోజులుగా బయటకు పొక్కకుండా ఉద్యోగుల బదిలీలు చేస్తున్నారనే చర్చ ఆశాఖలో జోరుగా సాగుతోంది.

మా దృష్టికి వస్తే చర్యలు తప్పవు

డ్వామాలో అధికారులు, ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా ఉండాలి. అయితే ప్రస్తుతానికి బదిలీలు లేవు. ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నందున బదిలీలకు కొద్దిగా మినహాయింపు ఇచ్చారు. ఏపీడీ, ఏపీఓల బదిలీలపై పరిశీలిస్తాం. కలెక్టర్ బదిలీ చేసిన ఉత్తర్వుల మేరకు ఏపీఓలు అందరూ ఆయా స్థానాల్లో విధుల్లో చేరాల్సిందే. అలా విధుల్లో చేరని ఏపీఓలపైనా చర్యలు ఉంటాయి. బదిలీలకు సంబంధించి ఎటువంటి ప్రలోభాలను ఉద్యోగులు నమ్మొద్దు. కొత్తగా ఎవరినీ బదిలీ చేయలేదు.

\- సలీంబాషా, డ్వామా పీడీ

టమోటా కిలో రూ.43

అనంతపురంరూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్ లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.43తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 2250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.28, కనిష్ఠ ధర రూ.16 పలికినట్లు ఆయన తెలిపారు.

1.675 టీఎంసీల నీటినిల్వ

బెళుగుప్ప, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.675 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. అలాగే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1193 క్యూసెక్కులు వుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1071 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు.

మీటర్ రీడర్లకు ఉపాధి గండం..!

● స్మార్ట్ మీటర్ల రాకతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో టెన్షన్
● ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్


ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు (ఫైల్)

కదిరి అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల రాకతో రీడర్ల బతుకు ప్రశ్నార్థకంగా మారింది. ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు ఊడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా చాలీచాలని వేతనాలతో కొనసాగుతున్నారు. రెండుదశాబ్దాలుగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నవారు, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క విద్యుత్ స్మార్టుమీటర్లు తీసుకొస్తున్న సందర్భంల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని రీడర్లు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ఏర్పడే సర్కిల్ రీడర్లకు అర్హతలనుబట్టి షిఫ్ట్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లు, డ్రైవర్లు, గ్యాంగ్‌మెన్లుగా ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈమేరకు ఏపీ మీటర్ రీడింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల ఎస్ఈ సురేంద్రకు విన్నవించారు.

కదిరి పరిధిలో 50 మంది మీటర్ రీడర్లు: కదిరి పరిధిలో 50మంది వరకు మీటర్ల రీడర్లు పనిచేస్తున్నారు. వీరు ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీ వరకు విద్యుత్ మీటర్ రీడింగ్ తీస్తుంటారు. ఒక మీటర్ రీడింగ్ తీసినందుకు విద్యుత్ శాఖ సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.6 నుంచి రూ.7 చెల్లిస్తుంది. మిషన్ చార్జీలు, ఫోన్ రీచార్జి, రోల్స్, మరమ్మతులు ఈఎస్ఐ, ఈపీఎఫ్ కటింగ్‌లు పోను రీడర్ చేతికి వచ్చేది కేవలం రూ.3.50 మాత్రమే. సగటున ఒక్కొక్క మీటర్ రీడర్ మూడువేలనుంచి 3,500 మీటర్లకు రీడింగ్ తీసే అవకాశముంది. దీంతో వీరికి నెలకు రూ.పదివేల వరకు ఆదాయం సమకూరుతుంది.

అర్హతలను బట్టీ ఉద్యోగం ఇవ్వాలి



ఎంతోకాలంగా విద్యుత్ మీటర్ రీడర్‌గా పనిచేస్తున్నా. విద్యార్హతను బట్టి రెగ్యులర్ ఉద్యోగం ఇవ్వాలి. షిఫ్టు ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లు, డ్రైవర్లు, గ్యాంగ్‌మెన్లుగా ఉపాధి కల్పించి ఆదుకోవాలి. మాలోనూ విద్యార్హతలు ఎక్కువగా ఉన్నారు. అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.
- రాఘవ, విద్యుత్ మీటర్ రీడర్

చాలీచాలని వేతనంతో నెట్టుకొస్తున్నాం



ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనంతో కుటుంబ జీవనం సాగిస్తున్నా. నెలకు రూ.పదివేలకు మించి ఆదాయం రాదు. ప్రభుత్వం మాపట్ల సానూకూల నిర్ణయం తీసువాలి. తమకు ఈపని తప్ప మరోపని రాదు. తమకు ఉద్యోగభద్రత కల్పించి ఆదుకోవాలి.
- జమీర్, విద్యుత్ మీటర్ రీడర్

ఉద్యోగ భద్రత కల్పించాలి



జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. రెండు దశాబ్దాలకుపైగా పనిచేసేవారు చాలా మంది ఉన్నారు. వీరంతా మీటర్‌కు కొంత రేటు చొప్పున వేతనం పొందుతున్నారు. ఇంతకాలంగా పనిచేస్తున్నా నేటికీ అవుట్‌సోర్సింగ్ సిబ్బందిగానే పనిచేస్తున్నారు. సీనియార్టీ, అర్హతలను బట్టీ విద్యుత్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగులుగా అవకాశం ఇవ్వాలి. చిరుద్యోగులపట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.
- జీఎల్ నరసింహులు, సీఐటీయూ

18 కోట్ల సభ్యత్వంతో అగ్రగామిగా బీజేపీ

● మంత్రి సత్యకుమార్ యాదవ్


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ 18 కోట్ల సభ్యత్వంతో అగ్రగామి పార్టీగా నిలిచిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో శనివారం నిర్వహించిన భారతీయజనతాపార్టీ ఎస్సీ మోర్చా సత్యసాయిజిల్లా సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎస్సీమోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య, రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పార్టీ సభ్యత్వం చేపడతామన్నారు. బీజేపీ 18 కోట్ల సభ్యత్వంతో దేశంలోనే అతి పెద్ద పార్టీ అన్నారు. దేశాభివృద్ధికి మోదీ ప్రభుత్వం, రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, జింకా చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి, భక్తవత్సలం, నబీరసూల్ పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ పోలప్ప

కదిరి అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షహమీరియా వలీసాబ్‌రోడ్డు, ఆర్ఎస్‌రోడ్డులోని సచివాలయాలను డీఎల్‌డీఓ పోలప్ప శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టి, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయలన్నారు. బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. సమయ పాలన పాటించని ఉద్యోగులపై చర్యలుంటాయన్నారు

రూరల్ ఎస్ఐగా శ్రీనివాసులు



ధర్మవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం రూరల్ ఎస్ఐగా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నరేంద్ర రొద్దం మండలానికి బదిలీపై వెళ్లారు. శనివారం ఆంధ్రజ్యోతిలో దిక్కుదివానంలేదాయె అన్న కథనానికి పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బత్తలపల్లి ఎస్ఐగా పనిచేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులును ఇక్కడకు బదిలీచేశారు. మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీ షీటర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగేంద్ర

గాండ్లపెంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు రూరల్ సీఐ నాగేంద్ర శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. పలు కేసుల్లో ముద్దాయిలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు. ఎలాంటి నేరాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మండల సమస్యలపై ఎస్ఐ క్రిష్ణవేణిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు, భాస్కర్, బాషా నరసింహులు ఉన్నారు.

భూ రీసర్వే గ్రామసభల్లో 11 ఫిర్యాదులు


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున

తనకల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉస్తిలిపల్లి గ్రామంలో శనివారం దిగువమండ్లిపల్లి రెవెన్యూ గ్రామంలో భూ రీసర్వే గ్రామ సభను అధికారులు నిర్వహించారు. సభలో 11 మంది రైతులు తమ భూములకు సంబంధించిన వివిధ రకాల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈవిషయాలను క్షుణ్ణంగా రికార్డులు పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

32 మంది ఉద్యోగాలకు ఎంపిక

ధర్మవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 32 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్లేస్‌మెంట్ అధికారి తేజ్ కుమార్, సిడాప్ డీపీటీ నారాయణస్వామి తెలిపారు. జాబ్‌మేళాలో 59 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో 32 మందిని ఎంపిక చేశామన్నారు. పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

బుక్కపట్నం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెండ్రాయునిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుట్టపర్తికి చెందిన దాతలు షామీర్, షాకీర్ శనివారం రూ.20వేలు విలువ చేసే విద్యా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, ఆసిఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యా సామగ్రితో విద్యార్థులు

తగ్గిన బీసీ హాస్టల్ విద్యార్థుల హాజరు శాతం

● సెలవులు ముగిసి ఐదు రోజులైనా రాని విద్యార్థులు
● ఇన్‌చార్జి వార్డన్ ఉండటమే కారణమా?


హాస్టల్‌లో ఉన్న ముగ్గురు విద్యార్థులు

గాండ్లపెంట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. హాస్టల్‌లో 6 నుంచి 10 వరకు 110మంది విద్యార్థులున్నారు. వీరికి ప్రత్యేక తగరతులతో విద్యనందించాలని బీసీసంక్షేమశాఖ ఉద్దేశ్యం. 10వ తరగతి చదువుతున్న దూర ప్రాంతాల విద్యార్థులు 28 మంది హాస్టల్‌లో ఉన్నారు. శనివారం ఉదయం హాస్టల్‌లో కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. దసరా సెలవులు ముగిసి ఐదురోజులైనా విద్యార్థులు హాస్టల్‌కు రాకపోవడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. హాస్టల్‌లో ఇన్‌చార్జి వార్డన్ ఉండటమే కారణమని అంటున్నారు. విద్యార్థులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ వర్డన్‌ను నియమించాలని హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై సంబంధిత వార్డన్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

డాక్టర్ నిర్లక్ష్యం.. రోగికి ప్రాణసంకటం

● ఇంజక్షన్ వేసిన ఏఎన్ఎం
● ఇన్‌ఫెక్షన్‌తో నడవలేని స్థితిలో రోగి


బాధితులపై మండిపడుతున్న వైద్యుడు

బత్తలపల్లి, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా రోగికి ఇనెక్షన్ అయిన సంఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బత్తలపల్లికి చెందిన బాధితుడు నరసింహులు తెలిపిన మేరకు గతనెలలో జ్వరం రావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చానన్నాడు. డాక్టర్ గంగిరెడ్డి ఉదయం 11 గంటలకు రాగా వైద్య చేయించుకునేందుకు వెళ్లానని, ప్రస్తుతం డ్యూటీ నాదికాదని మహిళా డాక్టర్ వస్తారని చూపించుకోవాలని నిర్లక్ష్యంగా చెప్పి వెళ్లిపోయారన్నారు. అక్కడే ఉన్న ఏఎన్ఎం సూది వేసి మందులు ఇచ్చారని తెలిపారు. ఇంజెక్షన్ వేసిన ఆరు రోజులకు ఆ ప్రాంతం అంతా నొప్పి ఎక్కువ కావడంతో శుక్రవారం మళ్లీ ఆస్పత్రికి వచ్చానని తెలిపారు. డ్యూటీలో ఉన్న ఏఎన్ఎం ఈ రోజు డాక్టర్ లేరని శనివారం రావాలని సూచించినట్లు తెలిపారు. శనివారం ఉదయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి సమస్యను డాక్టర్ గంగిరెడ్డికి చెప్పగానే నాపై చిందులు తొక్కారన్నారు. నా భర్త నడవలేకపోతున్నాడని చెప్పగానే యాక్షన్ చాలులే అంటూ ఇష్టానుసారం తిడుతున్నాడని నరసింహులు భార్య కుల్లాయమ్మ బోరున విలపించింది. తాము ఎస్సీలమని చెప్పినా మండిపడుతున్నాడని వాపోయారు. ఇంజెక్షన్ వేయించుకున్నప్పటి నుంచి పనులకు కూడా వెళ్లలేకపోతున్నాడని, కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు.

ఏపీఎం పనితీరుపై విచారణ


మహిళా సభ్యులను విచారిస్తున్న జిల్లా అధికారి

గాండ్లపెంట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీఎంగా పనిచేస్తున్న సూర్యనారాయణ పనితీరుపై జిల్లా ఐబీఎల్ఏపీఎం ఓబులేసు శనివారం విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 5వ తేదీన 27వ వార్షిక మహాసభ నిర్వహించారు. మహిళా సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈసభలో అధికారులు పాల్గొనరాదు. ఇందుకు విరుద్ధంగా ఏపీఎం పాలకవర్గ సభ్యుల ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎన్నికల్లో ఎస్సీఎస్టీ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, ఒకేవర్గానికి చెందిన వారిని ఎన్నుకున్నారు. ఈవిషయంపై మహిళా సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఐబీఎల్ఏపీఎం గతంలో పనిచేసిన మహిళా సభ్యులతో విచారించామన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందచేస్తామని ఆయన పేర్కొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టండి


ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు, సీపీఎం నాయకులు

ధర్మవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లి రహదారి మరమతులు చేపట్టాలని గ్రామస్థులు ఎంపీడీఓ సాయిమనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రహదారి గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైందని వాపోయారు. వర్షాలు వచ్చినప్పుడు బురదగుంటగా మారి వెళ్లడానికి వీలులేకుండా పోయిందన్నారు. ఈ దారి తప్ప మరొక దారిలేక ఇబ్బంది పడుతునాన్నమని, విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి పడరానిపాట్లు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓను కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లిపెద్దన్న, పట్టణ కార్యదర్శి మారుతి, గ్రామస్థులు మనోజ్‌కుమార్, ఆంజనేయులు, వెంకటరమణ, భగవంత, నాగరాజు పాల్గొన్నారు.

ఈ దారివెంట వెళ్లలేకున్నాం..: ధర్మవరంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని దుర్గానగర్‌లో అర్బన్ హెల్త్‌సెంటర్‌కు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. హెల్త్‌సెంటర్‌కు వెళ్లే రోగులు, పాఠశాలకు వెళ్లే పిల్లలు బురదగుంటలో జారిపడుతున్నట్టు స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


అర్బన్ హెల్త్‌సెంటర్‌కు వెళ్లే దారిలో బురద

కార్యాలయాన్ని ఆలయంలా భావించాలి

● న్యాయాధికారి జయలక్ష్మి


కదిరి కోర్టులో బూజు దులుపుతున్న న్యాయాధికారి

కదిరిలీగల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి తాము పని చేసే కార్యాలయాన్ని దేవాలయంలా భావించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, న్యాయాధికారి ఎస్.జయలక్ష్మి అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కోర్టులో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్‌కోర్టు పర్యవేక్షణాధికారి ప్రకాష్‌బాబుతో పాటు ఆమె కోర్టులోని అన్ని విభాగాలను సందర్శించారు. పరక చేతపట్టి కనిపించిన బూజును తొలగించారు. సిబ్బంది చేత కూడా పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుభ్రం చేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నెలలో ప్రతి మూడో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తాను ప్రతిసారి అన్ని విభాగాలను పరిశీలిస్తానని శుభ్రతలేకపోతే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. కోర్టులోని కొన్ని భవనాలు వర్షానికి కారుతుండటం పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పర్యవేక్షణాధికారిని ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత కోసం స్వచ్ఛతాహీ సేవ


పుట్టపర్తి కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న న్యాయాధికారి రాకేష్

పుట్టపర్తి రూరల్: కోర్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కోసమే స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పుట్టపర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ అన్నారు. శనివారం కోర్టు పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఇందులో భాగంగా కోర్టు పరిసరాలు పరిశుభ్రం చేయడం చేశామన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యకర సమాజం నెలకొంటుందన్నారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యుత్ కార్మికుడి మృతి


రియాజ్ భార్యకు ఆర్థికసాయం అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

బుక్కపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఒప్పంద విద్యుత్ కార్మికుడుగా పనిచేస్తున్న రియాజ్(66) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. బంధువులు తెలిపిన మేరకు రియాజ్ 30 ఏళ్లగా పంచాయతీ కార్యాలయంలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తూ పనిచేస్తున్నాడన్నారు. ఈనెల 10న స్థానిక వరగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో విద్యుత్ మరమ్మతులు చేస్తూ, ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. రియాజ్ కుటుంబాన్ని సర్పంచ్ నాగలక్ష్మీ రాజు, కార్యదర్శి సాదిక్‌వలీ పరామర్శించి అంత్యక్రియలకు రూ.15వేలు ఆర్థికసాయం అందించారు.

టీడీపీ నాయకుడు..


తిమ్మప్ప (ఫైల్)

నంబులపూలకుంట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటిబైలు దళితవాడకు చెందిన టీడీపీ గ్రామ కమిటీ ఎస్సీసెల్ అధ్యక్షుడు తిమ్మప్ప (48) శనివారం మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు తిమ్మప్ప పశువులకాపరిగా జీవనం సాగిస్తున్నాడు. రోజువారి పనిలో భాగంగా 17వ తేదీన పశువులను మేపుకుని ఇంటికి తీసుకువచ్చాడన్నారు. ఇంటి సమీపంలో జారి పడడంతో తలకు బలమైన గాయమైందన్నారు. వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు చెప్పారు. తిమ్మప్పకు భార్య మల్లమ్మ, కుమారై ఉన్నట్లుచెప్పారు. తిమ్మప్ప మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, వెంకటనారాయణ, శ్రీనివాసులు, సర్పంచ్ విష్ణుమూర్తి తిమ్మప్ప ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు


కూలిన పెంకుటిల్లు

ధర్మవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లక్ష్మీచెన్నకేశవపురంలో నివసిస్తున్న షేక్‌బానుకు చెందిన పెంకుటిల్లు శుక్రవారం రాత్రి కూలిపోయింది. భారీ వర్షాలకు తడవటంతో రాత్రి కూలిపోయింది. కూలుతున్న సమయంలో షేక్‌బాను, కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీశారు. దీంతో ప్రమాదం తప్పింది. ఇంట్లోని వస్తువులు, బియ్యం, ఇతర సామగ్రి తడిసిపోయాయి. విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, టైలర్‌గోపాల్ కూలిన మిద్దెను పరిశీలించి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ నటరాజ్ మిద్దెను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కదిరి అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రూరల్ సీఐ మోహన్ శనివారం పట్టుకున్నారు. ఆయన తెలిపిన మేరకు వాహనాల తనిఖీలో భాగంగా నడింపల్లి వద్ద తనిఖీలు చేస్తుండగా బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. 42 బస్తాల్లో 2,147 కేజీల బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. బియ్యం వ్యాపారి, వాహన యజమాని పవన్‌తో పాటు, వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, కేసున మోదు చేసినట్లు చెప్పారు.

పంటల పరిశీలన

నల్లమాడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన పంటలను మూడురోజులుగా పరిశీలించినట్లు ఏఓ సుమతి శనివారం తెలిపారు. మండలంలోని ఎర్రవంకపల్లి, ఓడీసీ మండలం ఇనగలూరు, అమడగూరు మండలం చెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం సానేవారిపల్లి, తలుపుల మండలం గొల్లపల్లి తండా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించామన్నారు. వేరుశనగలో యజమాన్య పద్ధతులు పాటించిన రైతులను ఎంపిక చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎంపికైన 26 మంది రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందించడానికి ఎక్స్‌టర్నరల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ రవి, డాక్టర్ కిరణ్‌మై ఆధ్వర్యంలో పొలలను 17 నుంచి 19వరకు పరిశీలించామన్నారు. రైతులు పండించిన పంటలను బెంగళూరులోని ల్యాబ్‌ను ఏపీఎస్ఓపీసీఏ ద్వారా పంపామన్నారు. పంటల్లో పురుగు అవశేషాలు, పురుగుమందు, రసాయనిక ఎరువులు ఎంత మోతాదులో ఉన్నాయో పరీక్షలకు పంపామన్నారు. ల్యాబ్‌నుంచి నివేదికలు వచ్చిన వెంటనే రైతులను ఎంపిక చేసి, ధ్రువీకరణ పత్రాలు అందచేస్తామన్నారు. కదిరి వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, సుమతి, లక్ష్మీనరసింహులు, వెంకటేష్, షర్ఫూద్దీన్, క్రిష్ణవేణి, రెడ్డెప్ప, అపర్ణ, నాగరాజు, బేబీ పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

కదిరి అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఓడీసీ మండలకేంద్రంలో ఏర్పాటుచేస్తున్న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి రూ.పదివేలు విరాళం శనివారం అందచేశారు. కదిరిలోని ఆయన నివాసంలో చెక్కును కమిటీ సభ్యులకు అందచేశారు.


వాల్మీకి కమిటీ సభ్యులకు చెక్కును అందచేస్తున్న దాత

భక్తిశ్రద్ధలతో ప్రాకారోత్సవం

హిందూపురం అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు ని ర్వహించి పూలు, నగలతో సర్వాంగ సుందరంగా ము స్తాబు చేశారు.

సర్వీసును క్రమబద్ధీకరించండి


రామాంజనేయ రెడ్డి

పెనుకొండ, అక్టోబరు19: (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 1998 ఎంటీఎస్ టీచర్స్ సర్వీసు క్రమ బద్ధీకరణ చేయాలని సంఘం అధ్యక్షుడు రామాంజనేయ రెడ్డి, సభ్యుడు మారుతిరెడ్డి ఒక ప్రక టనలో కోరారు. ఎంటీఎస్ టీచర్లు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వీరికి ఎలాంటి టీఏ డీఏ కనీస పెన్షన్ విధానం కూడా అమలు కావటం లేదన్నారు. ఎవరైనా ఆకస్మికంగా చని పోయినా ప్రమాదాల్లో గాయపడినా కుటుంబాలు ఇబ్బం దులకు గురికావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం వీరిపై దయవుంచి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్నారు.

రీసర్వేపై గ్రామసభలు


రీసర్వే గ్రామసభలో మాట్లాడుతున్న డీటీ

సోమందేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో శనివారం రెవెన్యూ అధికా రులు గ్రామసభ ఏర్పాటు చేశారు. రెవెన్యూ రీసర్వేవల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం వీలు కల్పించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీటీ రెడ్డిశేఖర్ కోరారు. ఇందులో భాగంగా ఏదైనా తప్పిదాలు జరిగిఉంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. దీనిపై ముగ్గురు రైతులు అర్జీలను సమర్పించారు. కార్యక్ర మంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేడుకగా వాల్మీకి జయంతి

పరిగి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని చెరువుకట్టవద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి శనివారం ఊటకూరు మాజీ సర్పంచ్ ఈశ్వరప్ప, వాల్మీకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణం రచించిన మహాకవి వాల్మీకి 24 వేల శ్లోకాలు రచించి ప్రసిద్ధి చెందారని, ఆయన వారసత్వంలో జన్మించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టప్ప, ఈశ్వరప్ప, కుమార్, నరసిం హులు, సోము, సురేష్ శ్రీరాములు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల మహోత్సవం


జ్యోతులు మోస్తున్న మహిళలు

సోమందేపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రామాయణ రచయిత మహర్షి వాల్మీకి అందరికీ ఆదర్శ ప్రాయుడని ఆయన జీవితం యువతకు స్ఫూర్తి దాయకమని మాజీ జెడ్పీటీసీ వెంకటరాముడు, సర్పంచ్ నరసింహులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని చెన్నాపురం గ్రామంలో వాల్మీకి జయంతిని పురస్క రించుకుని జ్యోతులమహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో వీధులగుండా ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి మహర్షి ఆలయం వద్ద జ్యోతులు, బాణాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సమితిసభ్యులు అంజి, హనుమంతు, వెంకటేశులు, శ్రీనివాసులు, లౌలీ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ


పాఠశాలను తనిఖీ చేస్తున్న న్యాయాధికారి వాసుదేవన్

గోరంట్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను పెనుకొండ మండల న్యాయ సేవా సమితి ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంట గది, వసతి సదుపాయాలు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ప్రభుత్వంనుంచి విద్యార్థులకు అందాల్సిన పథకాల గురించి ఆరా తీశారు. ఏర్పాట్లు, వసతి సదుపాయాలపై విద్యార్థునులడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పెనుకొండ కోర్టు వద్ద ఉన్న మండల న్యాయసేవా సమితికి అర్జీ రూపంలో అందచేయాలని విద్యార్థులను కోరారు. తక్షణమే సహాయక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతోపాటు ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, ఎస్ఐ బాబు, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

రేపటి ప్రజాదర్బార్‌కు ఏర్పాట్లు

గోరంట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న గోరంట్లలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నడంతో అధికా రులు, టీడీపీ నాయకులు శనివారం ఏర్పాటుపై సమీక్షిం చారు. వెలుగు కార్యాలయంలో ఉదయం 10గంటలకు జరిగే కార్యక్రమానికి బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత హాజరుకానున్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన భవ్యశ్రీ క్రిమిసంహారక మందు తాగి శనిఆవరం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. వానవోలు గ్రామనికి చెందిన రాజశేఖర్ కుమార్ భవ్యశ్రీ ఇంటర్ చదువుతోంది. కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లగా, ఇంటిలో ఉన్న భవ్యశ్రీ వంగతోటకు ఉపయోగించే క్రిమిసంహాక మందును సేవించి అస్వస్థతకు గురైయ్యారు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురగా, డాక్టర్ ఉషా చికిత్సలనంతరం మెరుగైన వైద్యంకోసం ప్రయివేటు వాహనంలోహిందూపురం తరలించారు. అయితే ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పది గ్రామాల రోడ్డు పరిస్థితి దారుణం

- కొడికొండ చెక్‌పోస్టు నుంచి నిత్యం రాకపోకలు
- గుంతలు, మట్టి కోతలతో తప్పని ఇబ్బందులు
- వర్షం కురిస్తే నడవలేని దుస్థితి
- బీటీ రోడ్డుగా మార్చాలని విజ్ఞప్తి

చిలమత్తూరు, అక్టోబరు 19: కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లి మీదుగా కోడూరుకి వెళ్లే రోడ్డు ఇది. చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లి మీదుగా చిన్నప్పరెడ్డిపల్లి, మధురేపల్లి, కందూరుపర్తి, కోడూరు, సుబ్బరావుపేట, చాగలేరు తదితర గ్రామాలకు ఈ రోడ్డు ద్వారానే వెళ్లాల్సిఉంటుంది. 44వ జాతీయ రహదారిలోకి వెళ్లకుండా ఈ గ్రామాల నుంచి నేరుగా కొడికొండ చెక్‌పోస్టుకు చేరుకునే వెసులుబాటు ఉంది. దీంతో ట్రాఫిక్ నుంచి రక్షించుకోవడం కోసం ఎక్కువ మంది ఈ రోడ్డునే రాకపోకలకు ఉపయోగిస్తారు. అంతేకాకుండా ఈ గ్రామాల నుంచి కొడికొండ చెక్‌పోస్టుకి తక్కువ సమయంలో సురక్షితంగా చేరుకోవచ్చు. ఆయా గ్రామాల నుంచి కొడికొండ చెక్‌పోస్టుకి మధ్య దూరం కూడా తగ్గుతుంది. ఈ రోడ్డు ద్వారానే రైతులు పొలాల్లో పండిన ధాన్యం, ఇతర ఉత్పత్తులను మార్కెట్‌కి, ఇళ్లకు తీసుకెళుతుంటారు. అయితే వర్షాల కారణంగా రోడ్డు కోతకు గురై గుంతలమయంగా మారింది. ఈ కారణంగా రైతులు తమ సేద్యపు పనుల కోసం పొలాలకు వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. పొలాలకు ఎరువుల బస్తాలు తీసుకెళ్లాలన్నా, కూలీలను తరలించాలన్నా కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బీటీ రోడ్డుగా మార్చాలని..

పది గ్రామాలకు లింక్ రోడ్డుగా సేవలందిస్తున్న కొడికొండ చెక్‌పోస్టు, కోట్లోపల్లి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ఈ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డుని బీటీ రోడ్డుగా మార్చుతున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం ఆ పార్టీ ప్రజాప్రతినిధులు పలు దఫాలుగా భూమి పూజలు కూడా చేశారు. అయితే రోడ్డు అభివృద్ధి పనులు ఒక అంగుళం కూడా ముందుకు కదలక పోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకులోనయ్యారు. ముఖ్యంగా వర్షం కురిస్తే ఈ రోడ్డుపై వెళ్లేందుకు వీలు లేని పరిస్థితి నెలకొంటుందని పలువురు రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకు వచ్చి ఈ రోడ్డుని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు.


కోతకు గురైన కోట్లోపల్లి- కొడికొండ చెక్‌పోస్టు రోడ్డు

ఎంతో ఇబ్బంది పడుతున్నాం


వెంకటరెడ్డి

మా ఊరు నుంచి బయటికి వెళ్లాలంటే ఈ రోడ్డు ప్రధానమైనది. ఈ రోడ్డు ద్వారానే ఇతర గ్రామాల ప్రజలు కొడికొండ చెక్‌పోస్టుకి చేరుకొని అక్కడనుంచి ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. వర్షంవస్తే ఈ రోడ్డుపై నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది.

పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బందే


నాగరాజు

కొడికొండ చెక్‌పోస్టుకి వెళ్లాలంటే పది గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు ద్వారానే ప్రయాణిస్తుంటారు. ఇది మట్టి రోడ్డుగానే ఉండటంతో వర్షాలకు అధ్వానంగా తయారవుతోంది. కోతలకు గురై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుని బీటీ రోడ్డుగా మార్చితే బాగుంటుంది.

సత్వర న్యాయం లోక్ అదాలత్‌తోనే సాధ్యం


లోక్ అదాలత్ నిర్వహిస్తున్నదృశ్యం

హిందూపురం, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి): కక్షిదారులు దీర్ఘకాలం పాటు కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్‌లో కేసులుపరిష్కరించుకుంటే సత్వర న్యాయం జరుగుతుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణంలో లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా బాధితుల నుండి వినతుల రూపంలో స్వీకరించారు. ఈ విధంగా పలు కేసులకు సంబంధించి ఇరువర్గాలతో చర్చించి కేసుల పరిష్కారం కోసం సూచనలు చేశారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా లోక్ అదాలత్‌కు వచ్చే అధికారులు ఆకేసుకు సంబంధించి సమగ్ర సమాచారంతో హాజరు కావాలన్నారు. మునిసిపల్ అధికారులు భవనాలు కూల్చుతున్నారని అయితే తమకు పరిహారం అందలేదని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పట్టణంలోని ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్‌లలో బయోవ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ వేస్తున్నారన్నారు. వీటిని మునిసిపల్ సిబ్బంది తరలించడంలేదని, భవిష్యత్తులో దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందని న్యాయవాది నవేరా లోక్‌అదాలత్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, వన్నూరప్ప, సుదర్శన్, సిద్దు, నాగరాజరెడ్డి, సంతోష్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి క్రాస్‌లో పశువుల హల్‌చల్

ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారిన ఆవులు

సోమందేపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్‌వద్ద హిందూపురానికి వెళ్లే రహదారిపై నిత్యం పదుల సంఖ్యలో పశువులు రోడ్డుపై అడ్డుగా ఉండి ట్రాఫిక్‌కు అంతరాయంగా మారుతున్నాయి. దీంతో ఏంచేయాలో తోచక వాహనచోదకులు తలలు పట్టుకుంటున్నారు. శనివారం 50కిపైగా పశువులు రోడ్డుపై అడ్డుగా బైఠాయించడంతో బేజారెత్తిన వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రమేష్ సిబ్బందితో కలిసి కొత్తపల్లి క్రాస్‌వద్దకు చేరుకుని పశువులను తోలి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఆయన మాట్లాడుతూ పశువుల యజమానులు వాటిని రోడ్డుపైకి వదలకూడదని హెచ్చరించారు. ఇంటివద్దే కట్టేయాలన్నారు. లేనిపక్షంలో పశువులను గోశాలకు తరలిస్తామని తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న పోలీసులు

మోతుకపల్లిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

టీడీపీ మీడియా కోఆర్డినేటర్‌కు గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చంద్రమోహన్ యాదవ్

హిందూపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పాత కక్షల కారణంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. టీడీపీ పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ చంద్రమోహన్‌యాదవ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోతుకపల్లిలో నీటి ట్యాంకు విషయమై రామాంజినప్ప, గోపాల్, కుటుంబసభ్యులు ఘర్షణ పడ్డారు. ఈ సందర్భంలో చంద్రమోహన్‌యాదవ్ పట్టణం నుంచి మోతుకపల్లికి వెళ్లారు. వారు ఘర్షణ పడుతుండటంచూసి సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంలో రామాంజినప్ప, పవన్, అతని తల్లి ముగ్గురు చంద్రమోహన్‌యాదవ్‌పై దాడిచేశారు. అడ్డు వచ్చిన చంద్రమోహన్‌యాదవ్‌పై కూడా దాడిచేయడంతో గాయాలయ్యాయి. వీరిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు రామాంజినప్ప, అతని భార్య, కుమారుడు పవన్‌లపై కేసు నమోదు చేశారు.

మంత్రి సమక్షంలో బీజేపీలోకి కాంగ్రెస్ సీనియర్‌నేత

హిందూపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో హిందూపురం కాంగ్రెస్‌పార్టీకి చెందిన సీనియర్ నేత ఈడిగ ఆదిమూర్తి బీజేపీలో చేరారు. శనివారం మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఆయన ఐదు దశాబ్దాలుగా హిందూపురం నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీలో కీలకంగా పనిచేశారు. ఇతనికి రాష్ట్ర, జాతీయ నాయకులతో సైతం సంబంధాలున్నాయి. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావుపై 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేశారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగాడు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి దృష్టిలో పెట్టుకుని ఆ పార్టీని వీడినట్లు తెలిపారు. నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జీఎం శేఖర్ పాల్గొన్నారు.



ఆదిమూర్తిని బీజేపీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

విధుశేఖర భారతి సన్నిధిలో జపానందస్వామి


విధుశేఖర ఆశీర్వాదం పొందుతున్న జపానంద

పావగడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శృంగేరి శారద పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామిని పావగడ రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానంద స్వామి శనివారం భక్తి పూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. మధుగిరిలోని శంకరసేవా సమితి నూతన భవన ప్రారంభోత్సవానికి విధుశేఖర స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుకున్నారు. విజయవాడ, కర్ణాటక ప్రాంతాలలో వరద బాధితులను ఆదుకోవడానికి తనవంతు చేయూత నందించానన్నారు.

శోకం నుంచి శ్లోకం ఆవిర్భావం

తెలుగుదేశం పార్టీ పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్

హిందూపురం అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పక్షి శోకం చూసి చలించిపోయి న వాల్మీకి శోకం నుంచి శ్లోకం ఉద్భవించిందని, అదే రామాయణ మహా కావ్యానికి పునాది అయిందని తెలుగుదేశం పార్టీ పట్టణాధ్యక్షుడు డిఈ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని శ్రీకంఠపురంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచానికి ఆదర్శప్రాయుడైన సీతారామచంద్ర ప్రభువు జీవిత చరిత్రను రామాయణ మహా కావ్యంగా విశ్వానికి పంచాడని తెలియజేశారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని విశ్వ శాంతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అదే విధంగా వాల్మీకుల చిరకాల వాంఛ అయిన ఎస్టీ జాబితా విషంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని కోరారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు పెద్దసంఖ్యలో జ్యోతులు మోశారు. కార్యక్రమంలో శ్రీకంఠపురం వాల్మీకి సంఘం నాయకులు శంకర్, లింగప్ప, తేజ, లింగేష్, సతీష్, రంఘనాథప్పగారి శంకర్, రమణ, భాస్కర్, టీడీపీ లీగల్‌సెల్ నాయకుడు శివశంకర్, టీడీపీ నాయకులు 9వ వార్డు కౌన్సిలర్ మంజులాదుర్గ తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి కంచు విగ్రహం ఊరేగింపు

కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం


వజ్రపాళ్యంలో బీటలు వారిన స్తంభం

మడకశిరటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వజ్రపాళ్యం గ్రామంలో విద్యుత్ స్తంభం రెండుగా బీటలువారి కూలేందుకు సిద్ధంగా ఉంది. అలాగే నగర పంచాయతీ పరిధి లోని బేగార్లపల్లి గ్రామంలో ఈరా శప్ప ఇంటిపై స్తంభం వాలి చేతి కందుతోంది. గోవిందాపురం గ్రామ సమీపంలో చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. తరచూ ప్రమాదాలు జరు గుతున్నా విద్యుత్ అధికారులు సకాలంలో చర్యలు తీసుకోకపో వడం వల్ల ప్రమాదాలు పునరా వృతం అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలూడి పాఠశాలలో విద్యార్థుల ఆకలికేకలు

అగళి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అగళి మండలం ఆలూడి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని సుమారు 75మంది విద్యార్థులు శనివారం మధ్యాహ్నం పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాఠశాల వంట ఏజెన్సీవారు వ్యక్తిగతకారణాలతో విద్యార్థులకు శనివారం భోజనం తీసుకురాలేదు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుండటంతో గ్రామాల నుంచి ఇంటి నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఎలాంటి భోజనం క్యారియర్లు తీసుకురాకుండా వచ్చారు. తీరా మధ్యాహ్నం బడిలో భోజనం పెట్టకపోవడంతో బయట తినేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో శనివారం రోజంతా విద్యార్థులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకుండా విద్యార్థులను పస్తులుంచారు.

పశువుల గోడు పట్టని వైద్యులు


మృత్యువాత పడ్డ దూడ వద్ద పాడిరైతు

మడకశిరరూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) పాడి రైతులు ఎంతో కష్టపడి కోనుగోలు చేసిన పాడిపశువుల దూడలు మృత్యువాత పడుతున్నా పశుసంవర్ధకశాఖ అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడంలేని పాడి రైతులు వాపోతున్నారు. మండలంలోని బీరాయాపురం గ్రామంలో రాజగోపాల్ అనే రైతు పాడి ఆవుదూడ శనివారం ఉదయం మృతి చెందింది. దీంతో ఆ రైతు లబోదిబోమంటున్నాడు. దీనిపై పాడిరైతు రాజగోపాల్ మాట్లాడుతూ గ్రామంలో రెండు రోజుల్లో పాడి ఆవు, దూడ మృతి చెందాయని, అయినా పశుసంవర్ధక అధికారులు మాత్రం పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోని పాడి పశువులు మృత్యువాతన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్ల పంపిణీ చేస్తున్న ఆర్డీటీ సిబ్బంది

గుడిబండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 90 మంది విద్యార్థినులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో సైకిళ్లను శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఆర్డీటీ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. స్పెయిన్ దేశస్తులు లహోరీ, ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున, ఏటీఎల్ మీనాక్షి, ప్రధానోపాధ్యాయులు రామ్మూర్తి, స్కూల్ కమిటీ ఛైర్మన్ ప్రసాద్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తహసీల్దార్ నోటీసుకు వ్యతిరేకంగా ధర్నా

పావగడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని కేటీహళ్లి గ్రామంలో చెరువు పక్కన గ్రామకంఠంలో నిర్మించుకొన్న ఇంటికి పట్టా లేదని కనుక ఇల్లు తొలగించాలని తహసీల్దార్ కార్యాలయం నుండి నోటీసులను వ్యతిరేకిస్తూ శనివారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. గ్రామ ఠాణాకు సంబంధించి 96వ సర్వే నంబరులో గిరిజనులు, మైనారిటీలు వెనుకబడిన కులాలకు చెందిన 30 ఇళ్లకు గ్రామ పంచాయతీ నుండి ఎన్‌ఓసీలు అందించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు పూజారప్ప డిమాండ్‌చేశారు. ఇళ్ల స్థలాలు ఖాళీ చేయాల్సిన పరిస్థితి వస్తే వేరొక చోట ఇల్లు కట్టించి బాధితులను ఆదుకొని న్యాయం కల్పించాలని వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షులు పాలేకర్ లోకేష్ కోరారు.

పేదరిక నిర్మూలనే ఆర్డీటీ ధ్యేయం

రొళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని ఉన్నత పాఠశాలలో ఒంటరి మహిళలతో స్పెయిన్ బృందం వారు సమావేశం నిర్వహించారు. ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఆరుసంవత్సరాల నుండి కుటుంబ పెద్ద కోల్పోయిన వారికి, ఒంటరి మహిళలకు ఆర్డీటీ సంస్థ అండగా నిలిచిందన్నారు. అనంతరం రొళ్లలో వెలిసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్య క్షేత్రాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. స్పెయిన్ దేశస్తులు భారతీయ సంప్రదాయం గొప్పదని కొనియాడారు. ఈకార్యక్రమంలో రొళ్ల ఏటీఎల్ ఓబుళేషు, స్పెయిన్ దేశ ప్రతినిధులు ఇష్టవాన్, నీవాస్, విన్సెంట్ పాల్గొన్నారు.

పంచాయతీ అధికారులను నియమించండి

గుడిబండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబులబండ గ్రామపంచాయతీకి అధికారులను నియమించాలని ప్రజలుకోరారు. పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

ప్రాంతీయ స్థాయికి త్రోబాల్ విజేతలు

పావగడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శిరా తాలూకా బువనహళ్లిలో జరిగిన త్రోబాల్ జిల్లాస్థాయి ఆటల పోటీలలో పావగడ పట్టణానికి చెందిన శారదా విద్యాపీఠం విద్యార్థులు గెలుపొంది ప్రాంతీయ స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా వ్యాప్తంగా బువనహళ్లిలో జరిగిన త్రోబాల్ ఆటల పోటీల్లో 20 జట్లు పాల్గొనగా పావగడ శారదా విద్యాపీఠం విద్యార్థులు సునాయాసంగా గెలుపొంది ప్రాంతీయ స్థాయికి ఎంపికైనట్లు నిర్ణయించారు.